"మధురమైన పిల్లలూ - ఇప్పుడు నాటకం పూర్తవుతుంది, ఇంటికి వెళ్ళాలి, కావున ఈ శరీరం రూపీ వస్త్రాన్ని మర్చిపోతూ వెళ్ళండి, స్వయాన్ని అశరీరి ఆత్మగా భావించండి"

ప్రశ్న:- ఏ అద్భుతమైన ఆట సంగమములోనే జరుగుతుంది, ఇతర యుగాలలో జరుగదు?

జవాబు:- విడాకులు ఇచ్చే (వేరు చేసే) ఆట. రాముడు, రావణుడి నుండి వేరు చేస్తారు. రావణుడు మళ్ళీ రాముడి నుండి వేరు చేస్తాడు. ఇది చాలా అద్భుతమైన ఆట. తండ్రిని మర్చిపోవడం వలన మాయ బాంబు తగులుతుంది, అందుకే తండ్రి శిక్షణను ఇస్తారు - పిల్లలూ, మీ స్వధర్మంలో స్థితులవ్వండి, దేహ సహితంగా దేహపు సర్వ ధర్మాలను మర్చిపోతూ వెళ్ళండి. స్మృతి చేసేందుకు చాలా బాగా పురుషార్థం చేస్తూ ఉండండి. దేహీ-అభిమానులుగా అవ్వండి.

పాట:- ఎవరైతే ప్రియమైనవారితో ఉంటారో... (జో పియా కే సాథ్ హై...)

ఓం శాంతి. మధురాతి-మధురమైన పిల్లలు నంబరువారు పురుషార్థానుసారంగా పాటను విన్నారు. ప్రతి విషయంలోనూ నంబరువారుగా అని చెప్పడం జరుగుతుంది ఎందుకంటే ఇది కాలేజీ లేక యూనివర్శిటీ, అలాగే ఇది సత్యమైన సత్సాంగత్యము కూడా. సత్యము అని ఒక్కరినే అనడం జరుగుతుంది. వారు ఒక్క సారి మాత్రమే వస్తారు. ఇప్పుడు ఈ సమయంలో - మేము సత్యము యొక్క సాంగత్యములో ఉన్నాము అని మీరు సత్యాతి-సత్యముగా చెప్తారు. బ్రాహ్మణులైన మీరే సత్యాన్ని వినిపించే ఆ జ్ఞానసాగరుని సమ్ముఖంలో కూర్చున్నారు. ఎవరైతే ప్రియమైనవారితో ఉంటారో, వారి కొరకు జ్ఞాన వర్షము కురుస్తుంది అన్న గాయనం కూడా ఉంది. ప్రియమైనవారు అని తండ్రినే అనడం జరుగుతుంది. పిల్లలైన మీ సమ్ముఖంలో ఆ ప్రియమైనవారి యొక్క జ్ఞాన వర్షం కురుస్తుంది. పిల్లలైన మీకు తెలుసు - తప్పకుండా జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు ఇప్పుడు మన సమ్ముఖంగా ఉన్నారు. మనం పతితులు నుండి పావనులుగా లేక ముళ్ళ నుండి పుష్పాలుగా అవుతున్నాము. పుష్పాలుగా తయారైపోతే ఇక ఈ శరీరము ఉండదు. మొగ్గ కూడా నెమ్మది-నెమ్మదిగా వికసిస్తూ ఉంటుంది. అది ఒక్కసారిగా వికసించదు. వికసిస్తూ-వికసిస్తూ పూర్తిగా పుష్పంగా అవుతుంది. ప్రస్తుతం ఎవ్వరూ పూర్తి పుష్పాలుగా అవ్వలేదు. అలా తయారైతే కర్మాతీత అవస్థ ఏర్పడుతుంది. దేహీ-అభిమానులుగానైతే చివరిలోనే తయారయ్యేది ఉంది. ఇప్పుడు మీ అందరి పురుషార్థము నడుస్తుంది. తండ్రి, పారలౌకిక పిత. వీరిరువురూ సంగమయుగపు అలౌకిక మాతా-పితలు. కొందరు ముళ్ళు ఉన్నారు, కొందరు మొగ్గలు కూడా ఉన్నారు. మొగ్గలు వికసించడానికి సమయం పడుతుంది. మీరందరూ నంబరువారుగా మొగ్గలుగా ఉన్నారు, పుష్పాలుగా అవ్వనున్నారు. కొందరు బాగా వికసించి ఉన్నారు, కొందరు సగం వికసించి ఉన్నారు. ఒక రోజు తప్పకుండా పూర్తిగా వికసిస్తారు. ఇది తోట కదా. మీకు తెలుసు - మేము ముళ్ళ నుండి మొగ్గలుగా అయితే అయ్యాము, ఇప్పుడు పుష్పాలుగా అవుతున్నాము, పురుషార్థం చేస్తున్నాము. కొందరు మొగ్గలుగా ఉండగానే అంతమైపోతారు, కొందరు కాస్త వికసించి అంతమైపోతారు. మాయకు చెందిన చాలా భారీ తుఫానులు వస్తాయి. సెంటర్లు తెరుస్తూ కూడా కొందరు అంతమైపోతారు, పడిపోతారు. మాయ చాలా శక్తివంతమైనది. ఇది రాముడు మరియు రావణుడు మధ్యన జరిగే సంఘర్షణ. రామ-రామ అని అనడం జరుగుతుంది. అలాగని త్రేతాయుగ రాముడిని గుర్తు చేసుకుంటారని కాదు. ఈ విధంగా రామ-రామ అని పరమాత్మ గురించి అంటారు. రావణుడితో రాముడిని పోల్చడం జరుగుతుంది. రాముడు తండ్రి, రావణుడు శత్రువైన మాయ. మాయ కూడా శక్తివంతమైనది. ఈ ఆట ఒకరినొకరు వేరు చేసుకునే ఆట. రాముడు మిమ్మల్ని మాయా రావణుడి నుండి వేరు చేస్తారు. మళ్ళీ మాయ మిమ్మల్ని రాముడైన తండ్రి నుండి వేరు చేస్తుంది. తండ్రి అంటారు - దేహ-సహితంగా దేహ సంబంధీకులు మొదలైనవారు ఎవరైతే ఉన్నారో, అందరినీ బుద్ధి ద్వారా త్యజించండి. సర్వ ధర్మాలను పరిత్యజించండి... నేను ఫలానాను, ఫలానా ధర్మానికి చెందినవాడిని - ఇది మరచి మీ స్వధర్మంలో స్థితులవ్వండి. దేహపు సర్వ ధర్మాలను వదిలి స్వయాన్ని ఒంటరిగా భావించండి. ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువును త్యజించేలా చేస్తారు. అశరీరిగా అవ్వండి. నా వారిగా అయి నన్ను స్మృతి చేయండి. తండ్రిని మర్చిపోయినట్లయితే మాయ బాంబు తగులుతుంది. తండ్రిని స్మృతి చేసేందుకు పూర్తి పురుషార్థము చేస్తూ ఉండండి. మాయ కూడా చాలా శక్తివంతమైనది. తండ్రికి చెందినవారిగా అయిన తర్వాత కూడా మళ్ళీ మాయ త్యజించేలా చేసి తండ్రి నుండి వేరు చేస్తుంది. తండ్రిని ఎవ్వరూ వదలకూడదు. అర్ధకల్పము మీరు నన్ను స్మృతి చేస్తూ వచ్చారు. మీరే సంపూర్ణ భక్తులు కదా. భక్తిని కూడా మీరే ప్రారంభించారు.

కావున తండ్రి వచ్చి మాయను త్యజించేలా చేస్తారు. వారంటారు - స్వయాన్ని ఆత్మగా భావించండి. ఈ వస్త్రాన్ని (దేహాన్ని) మర్చిపోతూ వెళ్ళండి. ఇప్పుడిక మనం వెళ్ళాలి, అంతే. ఆ నాటకంలో కూడా పాత్రధారులు ఉంటారు. వారికి కూడా అవగాహన ఉంటుంది - ఇప్పుడిక 5-10 నిముషాల తర్వాత మా నాటకం పూర్తయ్యే సమయం వస్తుంది, ఇక మేము ఇంటికి వెళ్ళిపోతాము అని. ఇది నాటకం పూర్తయ్యే సమయంలో బుద్ధిలో ఉంటుంది, అంతేకానీ ప్రారంభంలో కాదు. మన 84 జన్మలు పూర్తయ్యాయి అని మీరు కూడా భావిస్తారు. ఇంకా ఎంత సమయం మిగిలి ఉండవచ్చు? మేము స్వర్గంలోకి లేక సుఖధామంలోకి ఎప్పుడు వెళ్తాము? అని మీరు అడుగుతారు. కానీ తండ్రి అంటారు - ఈ జీవితం ఎంతో విలువైనది, అమూల్యమైనది అని అనడం జరుగుతుంది. మీరు శ్రీమతంపై ఎంతో గొప్ప సేవను చేస్తారు. కేవలం పాండవులైన మీరే శ్రీమతంపై నడుస్తారు. గీత మొదలైనవాటిలో ఈ విషయాలు లేవు. ఈ బాబా ఎన్నో శాస్త్రాలు మొదలైనవి చదివి ఉన్నారు, గురువులను ఆశ్రయించారు. పాత్రధారులందరి పాత్ర ఏదైతే ఉందో, దాని గురించి మీకు తెలుసు. శాస్త్రాలనైతే తర్వాత కూర్చొని తయారుచేస్తారు. వారికేమి తెలుసు? ఇది కూడా డ్రామాలో ఆటగా రచింపబడి ఉంది. గీతా-భాగవతము మొదలైనవన్నీ తమ-తమ సమయమనుసారంగా రిపీట్ అవుతాయి. గీత మాతా, పిత వంటిది. గీతను మాత అని అంటారు. ఇంకే పుస్తకాన్ని మాత అని అనరు. దీని పేరే గీతా మాత. అచ్ఛా, దీనిని ఎవరు రచించారు? మొట్టమొదట పురుషుడు స్త్రీని తమవారిగా చేసుకుంటారు కదా. పురుషుడు వివాహం చేసుకున్నప్పుడు, ఈమె నా స్త్రీ అని నోటితో అంటారు. అంటే అతను రచయిత అయినట్లు కదా. తర్వాత ఆమె ద్వారా పిల్లలు జన్మిస్తే, అప్పుడు కూడా, వీరు నా వారు అని అంటారు. పిల్లలు కూడా - వీరు మా తండ్రి అని అంటారు. మీరు కూడా బాబా యొక్క ముఖవంశావళి. మీరు అంటారు - బాబా, మేము మీ వారము. ఇంత సమయం బట్టి మేము మాయ మతముపై నడుస్తూ వచ్చాము, ఇప్పుడు మీ మతముపై నడుస్తాము. మాయ ఏమీ నోటి ద్వారా మతాన్ని ఇవ్వదు. కర్మలు అటువంటివి చేస్తారు. ఇక్కడైతే తండ్రి కూర్చొని నోటి ద్వారా అర్థం చేయిస్తారు.

మీరందరూ భారతవాసులు. భారత్ యే శిరోకిరీటంగా ఉండేదని, ఇప్పుడు రెండు కిరీటాలూ లేవని మీకు తెలుసు. పవిత్రతా కిరీటము లేదు, అపవిత్ర కిరీటము లేదు. హర్ హోలీనెస్, హిజ్ హోలీనెస్ (మహాశయురాలు, మహాశయుడు) అని మహిమ చేస్తారు. స్త్రీ పురుషులు ఇరువురినీ అలా అంటారు. సన్యాసులను హిజ్ హోలీనెస్ (మహాశయులు) అని అంటారు. కానీ అది ప్రవృత్తి మార్గము కాదు. ప్రవృత్తి మార్గంలో స్త్రీ-పురుషులు ఇరువురూ పవిత్రంగా ఉంటారు. సత్యయుగంలో ఇరువురూ పవిత్రంగానే ఉంటారు, దానిని సంపూర్ణ పవిత్రత అని అంటారు. ఆత్మ మరియు శరీరము రెండూ పవిత్రంగా ఉంటాయి. ఇక్కడ పతిత ప్రపంచంలో రెండూ పవిత్రంగా ఉండవు. ఇప్పుడు మీరు తండ్రి సమ్ముఖంగా వింటున్నారు, దీనిని జ్ఞాన వర్షము అని అంటారు. అదేమో విషం యొక్క వర్షము. ఇదేమో జ్ఞానామృత వర్షము. అమృతాన్ని వదిలి విషాన్ని ఎందుకు తిన్నావు అని అంటూ ఉంటారు కదా. ఇప్పుడు మీకు జ్ఞానామృతం లభిస్తుంది. భక్తి మార్గంలోనైతే ఊరికే అలా పాడుతూ ఉంటారు. ఇప్పుడు మీకు ప్రాక్టికల్ గా జ్ఞానామృతం లభిస్తుంది. దీని కారణంగానే అమృత్సర్ అన్న పేరు వచ్చింది. ఆ మాటకొస్తే సరోవరాలైతే ఎన్నో ఉన్నాయి, మానస సరోవరం కూడా ఉంది కదా. మానస సరోవరం అంటే ఆ మనుష్యుల సరోవరం కాదు. ఇది జ్ఞానామృత సరోవరము, దీనిని జ్ఞాన మానస సరోవరము అని కూడా అంటారు. ఇక్కడ జ్ఞానసాగరుడు కూడా ఉన్నారు. కొందరు నదుల వలె ఉన్నారు, కొందరు కాలువల వలె ఉన్నారు, కొందరు చిన్న నీటి గుంటలు వలె ఉన్నారు. నంబరువారుగా ఉన్నారు కదా. పిల్లలు అర్థం చేసుకున్నారు. కల్పక్రితము కూడా తండ్రి అర్థం చేయించారు, మళ్ళీ ఇప్పుడు అర్థం చేయిస్తున్నారు. మేము బాబా నుండి రాజయోగాన్ని నేర్చుకుంటున్నామని మీరు నిశ్చయం చేసుకుంటారు. తద్వారా కల్పక్రితం కూడా మనం స్వర్గాధిపతులుగా అయ్యాము. మేము యజమానులము అని ప్రజలు కూడా అంటారు. మా భారత్ ఎంతో ఉన్నతంగా ఉండేదని భారతవాసులు అంటారు కదా. ఇప్పుడు మన ఆ భారత్ యే అన్నింటికన్నా నీచముగా ఉంది. మన భారత్ చాలా శ్రేష్ఠాచారిగా ఉండేది, ఇప్పుడు మన భారత్ చాలా భ్రష్టాచారిగా అయ్యింది. ఇంకే ఖండము గురించి ఈ విధంగా అనరు. భారత్ ప్రాచీనంగా ఉన్న సమయంలో మేము లేము అని - అన్ని ధర్మాలవారికి కూడా తెలుసు. సత్యయుగంలో తప్పకుండా కేవలం భారతవాసులే ఉంటారు. క్రైస్టుకు 3000 సంవత్సరాల క్రితం భారత్ యే ఉండేదని, ఇంకే ధర్మమూ ఉండేది కాదని గానం చేస్తారు కూడా. కొత్త ప్రపంచంలో కొత్త భారత్ ఉండేది. ఇప్పుడు పాత భారత్ ఉంది. భారత్ స్వర్గంగా ఉండేది. కానీ ఈ విషయం ఎవరి బుద్ధిలోనూ పూర్తిగా కూర్చోదు. ఇది చాలా సహజంగా అర్థం చేసుకునే విషయము. తండ్రి మీకు అర్థం చేయిస్తున్నారు. మీరు ప్రాక్టికల్ గా కర్తవ్యాన్ని చేస్తున్నారు. నంబరువారు పురుషార్థానుసారంగా సత్యాతి-సత్యమైన వ్యాసులుగా అవ్వాలి. సత్యమైన గీతను వినిపించాలి. మీరు పుస్తకాలు మొదలైనవేవీ చేతిలోకి తీసుకునేది లేదు. మీరు రూప్-బసంత్ (యోగ స్వరూపులు-జ్ఞాన స్వరూపులు). మీ ఆత్మ గీతా జ్ఞానాన్ని తండ్రి నుండి వింటుంది. మీ బుద్ధిలో ఒక్క తండ్రియే ఉన్నారు, ఇంకే ఇతర గురువులు-పండితులు,

సాధు-సత్పురుషులు మొదలైనవారు మీ బుద్ధిలో లేరు. మేము జ్ఞానసాగరుడైన పరమపిత పరమాత్మ ద్వారా వింటాము, వారినే సత్ శ్రీ అకాల్ అని అంటారు అని మీరు చెప్తారు. ఈ పదాలు ఎంత మధురంగా ఉన్నాయి. అకాలీలు (సిక్కు ధర్మంలోని ఒక ధార్మిక సంప్రదాయము వారు) - సత్ శ్రీ అకాల్... అని చాలా బిగ్గరగా అంటారు.

ఇక్కడ పిల్లలైన మీరు జ్ఞాన నాట్యం చేస్తారు, అందుకే అంటారు - సత్యమున్న చోట మనసు ఆనందముతో నాట్యము చేస్తుంది (మీరు సత్యమైనవారైతే సంతోషంలో నాట్యం చేస్తూ ఉండండి). తర్వాత మీరు అక్కడకు వెళ్ళి రాసవిలాసాలు (ఆటపాటలు) చేస్తారు. మీరా కూడా ధ్యానములో నాట్యము మొదలైనవి చేసేవారు. కానీ ఆమె భక్తి చేసారు. మీరేమీ భక్తి చేయరు. దివ్యదృష్టి ప్రదాత అయిన తండ్రి స్వయంగా మిమ్మల్ని చదివిస్తున్నారు. చాలామంది పిల్లలు సాక్షాత్కారాలు పొందుతూ ఉంటారు, దాని వలన మనుష్యులు ఇదేదో ఇంద్రజాలమని భావిస్తారు. పిల్లలు చదువుకుంటూ కూడా విహరిస్తూ ఉంటారు కదా, అలాగే మీ కొరకు ఇవి ఆట-పాటల వంటివి. ఇది సబ్జెక్ట్ ఏమీ కాదు, దీనికి మార్కులేమీ లేవు. ఆట-పాటలకు మార్కులేమీ ఉండవు. అలాగే ఇక్కడ కూడా ఎవరైతే ఈ ఆట-పాటలలో ఉంటారో, వారికి జ్ఞానము యొక్క మార్కులు లభించవు. ఇవి ఆట-పాటలు మాత్రమే, దీనిని అవ్యక్త ఆట అని అంటారు. అవి వ్యక్తమైన ఆటలు, ఇవి అవ్యక్తమైన ఆటలు. నాట్యము మొదలైనవి చేసేవారికి మార్కులు లభించవు, అందుకే బాబా అంటారు - ధ్యానము కన్నా జ్ఞానము మంచిది, శ్రేష్ఠమైనది. ధ్యానము అంటే కేవలం లక్ష్యము-ఉద్దేశ్యము యొక్క సాక్షాత్కారము మాత్రమే. ఇది రాజయోగము. లక్ష్యము-ఉద్దేశ్యము బుద్ధిలో ఉన్నాయి. నేను ఫలానాగా అవుతాను అని వారు ఈ కళ్ళతో చూస్తారు. ఇక్కడ ఇది మీ భవిష్య లక్ష్యము-ఉద్దేశ్యము. యువరాజులుగా, యువరాణులుగా అవ్వాలి, తర్వాత మీరు మహారాజులు, మహారాణులుగా అవుతారు. లక్ష్యము-ఉద్దేశ్యము లేకుండా ఎవరైనా కాలేజీలో కూర్చుంటే వారిని ఏమంటారు? భారత్ లో ఇతర సత్సంగాలేవైతే ఉన్నాయో వాటిలో లక్ష్యము-ఉద్దేశ్యము ఏమీ లేదు. దీనిని యూనివర్సిటీ అని కూడా అనవచ్చు, అలాగే పాఠశాల అని కూడా అనవచ్చు. సత్సంగాన్ని ఎప్పుడూ పాఠశాల అని అనరు.

మనము పతిత-పావనుడైన గాడ్-ఫాదర్లీ యూనివర్సిటీలో చదువుతామని పిల్లలైన మీకు తెలుసు. మొత్తం యూనివర్స్ (విశ్వం) అంతటినీ మీరు పవిత్రమైన స్వర్గంగా తయారుచేస్తారు. మీరు మీ కొరకే ఈ విశ్వాన్ని స్వర్గముగా తయారుచేస్తారు, ఎవరైతే తయారుచేస్తారో వారే మళ్ళీ రాజ్యం చేస్తారు. అందరూ ఏమీ స్వర్గానికి యజమానులుగా అవ్వరు. ఎవరైతే ఇంతకుముందు పూర్తి నరకవాసులుగా ఉన్నారో, ఎవరైతే ద్వాపరం నుండి భక్తి చేసారో, వారే స్వర్గవాసులుగా అవుతారు. మిగిలిన మనుష్యులంతా ఆవగింజల వలె నలిగి అంతమైపోతారు, ఆత్మలు తిరిగి తండ్రి వద్దకు వెళ్తాయి. ఎంత పెద్ద వినాశనం జరుగనున్నది! ఇప్పుడైతే ఎంతోమంది ప్రజలు ఉన్నారు. ఎంతని కూర్చుని లెక్కపెడతారు. కరెక్టుగా లెక్కపెట్టలేరు. ప్రపంచంలో ఎంతమంది మనుష్యులు ఉన్నారు. వారంతా అంతమైపోతారు. పిల్లలకు మర్రి వృక్షపు ఉదాహరణను కూడా తెలియజేయడం జరిగింది. కలకత్తాలో చాలా పెద్ద వృక్షము ఉంది, దానికి కాండము (పునాది) లేదు, మిగిలిన వృక్షమంతా ఉంది. అలాగే, ఇప్పుడు దేవీ-దేవతా ధర్మము ఉంది కానీ దాని పేరు కనుమరుగైపోయింది. అలాగని అసలు పునాది లేనే లేదు అని అనరు, కుళ్ళిపోయినా సరే గుర్తులైతే ఎన్నో కొన్ని ఉంటాయి కదా. కనుమరుగైపోవటం అంటేనే కొద్దిగా మిగిలి ఉంది అని అర్థము. చిత్రాలు ఉన్నాయి, భారత్ లో లక్ష్మీ-నారాయణులు రాజ్యం చేసేవారు. ఇవి చాలా సహజమైన విషయాలు కానీ మాయా రావణుడు బుద్ధికి తాళం వేసేస్తాడు. పరమపిత పరమాత్మ వివేకవంతులకు బుద్ధి వంటివారు. మనుష్యులలో బుద్ధి ఉంది కానీ అది తాళం వేయబడి ఉంది. రాతిబుద్ధి కలవారిగా అయిపోయారు. ఇప్పుడు బాబా మళ్ళీ మిమ్మల్ని పారసబుద్ధి కలవారిగా తయారుచేస్తారు. ఆత్మనే అలా తయారుచేస్తారు. బుద్ధి ఆత్మలోనే ఉంటుంది కదా. మీరు రాతిబుద్ధి కలవారు, గేదె బుద్ధి కలవారు అని అంటారు కదా. ఇక్కడ కూడా అలాగే. ఏమి అర్థం చేయించినా అర్థం చేసుకోరు, శ్రీమతంపై నడవరు. పిల్లలూ, అంధులకు చేతికర్రగా అవ్వండి అని శ్రీమతమైతే ఎల్లప్పుడూ చెప్తుంది. వినాలి మరియు వినిపించాలి. అందుకే సేవలో దూరదూరాల వరకు కూడా వెళ్ళవలసి ఉంటుంది. ఒకేచోట కూర్చుండిపోకూడదు.

ఇప్పుడు మీరు జ్ఞానాన్ని మరియు యోగాన్ని నేర్చుకుంటున్నారు. ఇక్కడ మీరు శివబాబా సమ్ముఖంలో కూర్చున్నారు. వారసత్వాన్ని తీసుకునేందుకు సహజ రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. మీరు విష్ణుపురి యొక్క రాజధానిని తీసుకునేందుకు వచ్చారు. విష్ణువు యొక్క విజయమాల తయారవుతుంది. ఇప్పుడు మీరు డ్రామా రహస్యాన్ని బాగా అర్థం చేసుకున్నారు. తప్పకుండా దైవీ స్వరాజ్యముండేదని, సత్యయుగ ఆదిలో రాజు-రాణులు ఉండేవారని మీకు తెలుసు. ఇప్పుడు కలియుగాంతంలో ఎవ్వరూ రాజు-రాణులుగా పిలువబడలేరు. కానీ ప్రభుత్వానికి

సహాయం చేస్తారు కాబట్టి మహారాజు అన్న టైటిల్ లభిస్తుంది. ఆ గవర్నమెంటు కూడా రాయ్ సాహెబ్, రాయ్ బహదూర్ మొదలైన టైటిళ్ళు ఇచ్చేది. ఇప్పుడు మీకు ప్రాక్టికల్ గా గొప్ప టైటిల్ లభిస్తోంది. మీరు హర్ హోలీనెస్, హిజ్ హోలీనెస్, మహారాజు, మహారాణిగా అవుతారు. మీ పై రెండు కిరీటాలు ఉన్నాయి. మొదట పవిత్ర రాజ్యము ఉంటుంది. ఆ తర్వాత అపవిత్ర రాజ్యము ఉంటుంది. ఇప్పుడు మళ్ళీ అపవిత్రులుగా ఉన్నారు, ఏ రాజ్యమూ లేదు. ప్రజలపై ప్రజల రాజ్యము కొనసాగుతోంది. డ్రామాను అర్థం చేసుకోవాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. రోజు జ్ఞానామృత మానస సరోవరంలో స్నానం చేస్తూ ఆత్మను మరియు శరీరాన్ని రెండింటినీ పావనంగా తయారుచేసుకోవాలి. మాయ మతాన్ని వదిలి తండ్రి మతముపై నడవాలి.

2. ఇది అమూల్యమైన సంగమ సమయం, ఈ సమయంలో శ్రీమతంపై నడుస్తూ సేవ చేయాలి. సత్యమైన వ్యాసులుగా అయి సత్యమైన గీతను వినాలి మరియు వినిపించాలి. రూప్-బసంత్ (యోగ స్వరూపులు-జ్ఞాన స్వరూపులు) గా అవ్వాలి.

వరదానము:- అనేక రకాల మంటల నుండి స్వయం రక్షింపబడే మరియు సర్వులను రక్షించే సత్యమైన దయార్ద్ర హృదయ భవ

నేటి మానవుడు అనేక రకాల మంటలలో కాలిపోతూ ఉన్నాడు. అనేక రకాల దుఃఖము, చింతలు, సమస్యలు... భిన్న-భిన్న రకాలుగా ఈ దెబ్బలేవైతే ఆత్మలకు తగులుతున్నాయో, ఈ మంటలు జీవించి ఉండగానే కాలిపోతున్న అనుభవం కలిగిస్తాయి. కానీ మీరు అటువంటి జీవితము నుండి బయటకు వచ్చి శ్రేష్ఠ జీవితములోకి వచ్చారు, మీరు శీతలమైన సాగర తీరములో కూర్చున్నారు. అతీంద్రియ సుఖము, శాంతి యొక్క ప్రాప్తిలో ఇమిడి ఉన్నారు, కనుక దయార్ద్ర హృదయులై ఇతర ఆత్మలను కూడా అనేక రకాల మంటల నుండి రక్షించండి. వీధి-వీధిలోనూ జ్ఞాన స్థానాలను తయారుచేసి అందరికీ ఆశ్రయాన్ని ఇవ్వండి.

స్లోగన్:- ఎవరికైతే ఒక్క తండ్రితో సత్యమైన ప్రీతి ఉంటుందో, వారికి అశరీరిగా అవ్వటము సహజము.